రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త





గుంతలమయంగా మారిన గోపాల్‌పూర్-నర్సాపూర్ రోడ్డు

# నోటీసుల నాటకం!

**రూ. 2.25 కోట్ల నిధులున్నా నరకకూపంగా పెద్దేముల్ రోడ్డు**

**రోడ్డుపై కొద్దిగా కంకర వేసి చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్**

**మొద్దునిద్రలో పంచాయతీరాజ్ శాఖ**

**చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు**

**నిలదీస్తున్న గోపాల్‌పూర్, రుద్రారం, నర్సాపూర్ గ్రామస్థులు**

**పెద్దేముల్, జూన్ 27 ప్రభాతవార్త:** నాలుగేళ్లుగా రోడ్డు పనులు నిలిచిపోయి ప్రజలు నరకయాతన అనుభవిస్తుంటే, పంచాయతీరాజ్ అధికారులు మాత్రం కాలయాపన చేస్తూ 'నోటీసుల నాటకానికి' తెరలేపారు. వివరాలలోకి వెళితే.. పెద్దేముల్ మండలం గోపాల్‌పూర్ నుంచి ఇందూరు వరకు బిటి రోడ్డు నిర్మించేందుకు 2022 సంవత్సరంలోనే రూ. 2.25 కోట్ల భారీ నిధులు మంజూరయ్యాయి. టెండర్లు దక్కించుకోవడంలో చూపించిన తొందరపాటు, పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్‌కు లేకుండా పోయింది. నాలుగేళ్ల క్రితం రోడ్డుపై కొద్దిగా కంకర వేసి చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్, అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. కంకర తేలిన రోడ్డుపై భారీ ఓవర్‌లోడ్ లారీలు తిరగడంతో రోడ్డు కాస్తా పెద్ద పెద్ద గోతులుగా తయారైంది.

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఈ గోతులు కాస్తా చెరువులను తలపిస్తున్నాయి. వాహనాలు దిగబడి, బైక్‌లపై వెళ్లేవారు కిందపడి కాళ్లు, చేతులు విరగ్గొట్టుకుంటున్నారు. "మా గోడు వినే నాథుడే లేడు" అని నర్సాపూర్, రుద్రారం, ఇందూరు గ్రామ ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు.

**ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని కాంగ్రెస్ నేతల ఆగ్రహం**

కాంట్రాక్టర్ అంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా బాధ్యత గల అధికారులు మొద్దునిద్ర వీడకపోవడం వెనుక పెద్ద మతలబే ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ల ద్వారా అంది పుచ్చుకునే ముడుపులపై ఉన్న ధ్యాస ప్రజలు పడుతున్న అవస్థలపై లేదని స్థానికులు నిప్పులు చెరుగుతున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల ఈ అడ్డగోలు నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి సైతం చెడ్డపేరు వస్తోందని, అధికారపార్టీ నాయకులే లోలోన మదనపడుతూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ఇదేనా ప్రజాపాలన?**

ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు, ఏటా బడ్జెట్లు మారుతున్నాయి.. కానీ ఆ గ్రామాల ప్రజల రాత మాత్రం మారడం లేదు. ప్రజాప్రతినిధుల ఓట్ల రాజకీయం, అధికారుల చేతివాటం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం తోడైతే అభివృద్ధి ఎలా అటకెక్కుతుందో చెప్పడానికి పెద్దేముల్ మండలంలోని రోడ్ల దుస్థితే సజీవ సాక్ష్యంగా ఉన్నాయి అని పలువురు విద్యావంతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిధులున్నా పనులు చేయటం లేదని, ప్రజలు నరకం చూస్తున్నా పట్టించు కోవటం లేదని, ఇదేనా ప్రజాపాలన అంటూ పాలకుల ఉదాసీతను ప్రశ్నిస్తున్నారు.

**బ్లాక్ లిస్టులో పెట్టండి..**

నాలుగేళ్లుగా నరకప్రాయంగా మారిన ఈ రహదారిని అభివృద్ధి చేయటంలో నిర్లక్ష్యం వహిస్తు పనులను అర్థాంతరంగా వదిలేసి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న కాంట్రాక్టర్‌ను వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టాలని గోపాల్‌పూర్, రుద్రారం, నర్సాపూర్, ఇందూరు గ్రామ ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. అతనికి సహకరిస్తూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న పంచాయతీరాజ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులకు ఫిర్యాదు చేయటానికి సమాయత్తమవుతున్నారు.

**కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపాం: డిఈ నాగభూషణం**

నాలుగేళ్లుగా రోడ్డు పనులు నిలిచిపోవడంపై పంచాయతీరాజ్ శాఖ డిఈ నాగభూషణం వివరణ కోరగా.. కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపించామని, త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. నాలుగేళ్లుగా లేని నోటీసులు ఇప్పుడే గుర్తొచ్చాయా? పనులు ఎప్పుడు మొదలవుతాయి? అప్పటివరకు ప్రజల ప్రాణాలకు గ్యారెంటీ ఏంటి? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు.





మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ అధికారి ఉమాగౌరి

# ఒక్కో చుక్కా.. జీవిత కాలపు రక్ష

**నేడు జాతీయ పల్స్ పోలియో మహోత్సవం**

**★ఐదేళ్లలోపు పిల్లలందరికీ వేయించాల్సిందే ★జిల్లాలో 5.31 లక్షల మంది చిన్నారుల లక్ష్యం ★డాక్టర్ సి. ఉమాగౌరి పిలుపు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 27, ప్రభాతవార్త:** "ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయిద్దాం.. పోలియో రహిత మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాను నిర్మిద్దాం" అనే పట్టుదలతో జిల్లా యంత్రాంగం కదంతొక్కు తోంది. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం 2026 నిర్వహణకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సర్వసన్నద్ధమైంది. ఈనెల 28న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయనున్నట్లు జిల్లా డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సి. ఉమాగౌరి వెల్లడించారు. గతంలో ఎన్నిసార్లు వేయించినా, చిన్నారులను పోలియో మహమ్మారి నుండి సంపూర్ణంగా రక్షించడానికి ఈ జాతీయ కార్యక్రమంలో మరోసారి చుక్కలు వేయించడం అత్యంత అవసరమని ఆమె స్పష్టం చేశారు.

**పకడ్బందీ ఏర్పాట్లు**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ముందెన్నడూ లేని విధంగా ఒక ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 48,28,324 మంది జనాభా, 14,46,993 గృహాలను పరిగణనలోకి తీసుకుని, ఐదేళ్లలోపు ఉన్న 5,31,328 మంది చిన్నారులను చేర డమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు.

**1,203 పోలియో బూత్‌లు**

జిల్లావ్యాప్తంగా రికార్డు స్థాయిలో 1,203 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రయాణాల్లో ఉండే వారి కోసం 31 ట్రాన్సిట్ పాయింట్లు, సుదూర ప్రాంతాల కోసం 40 మొబైల్ బృందాలను రంగంలోకి దించారు. వ్యాక్సిన్ నాణ్యత దెబ్బతినకుండా ఉండేందుకు 32 కోల్డ్ చైన్ కేంద్రాలను సిద్ధం చేసి, 29,166 పోలియో వ్యాక్సిన్ వయల్స్‌ను అందుబాటులో ఉంచారు.

**సంచార నివాసాలపై ప్రత్యేక నజర్**

అత్యంత ప్రమాదకర, వలస, సంచార నివాస ప్రాంతాలుగా గుర్తించిన 300 ప్రాంతాల్లోని 10,717 మంది చిన్నారుల కోసం ప్రత్యేక బృందాల ద్వారా సేవలు అందించేలా పటిష్ట చర్యలు చేపట్టారు.

**29, 30 తేదీల్లో ఇంటింటికీ వస్తాం**

మొదటి రోజు (ఆదివారం) కేంద్రాలకు రాలేకపోయిన చిన్నారుల కోసం సోమ, మంగళ వారాల్లో (జూన్ 29, 30) సిబ్బంది నేరుగా ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని డాక్టర్ ఉమాగౌరి తెలిపారు. ప్రతి పోలియో బూత్‌లో నలుగురు సిబ్బంది, ఇంటింటి సర్వేలో ఇద్దరు సభ్యుల బృందాలు పాల్గొంటాయి.

**మహా యజ్ఞంలో 5వేల మంది**

ఈ బృహత్తర ప్రజా ఆరోగ్య కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు కూడా భాగస్వా ముల వుతున్నాయి.

ఈ కార్యక్రమాన్నిపర్య వేక్షించడానికి 9 మంది జిల్లా స్థాయి అధికారులు, 120 మంది రూట్ సూపర్వైజర్లను నియమించారు. మొత్తం 2,406 ఇంటింటి బృందాలు, 4,812 బూత్ వ్యాక్సినేటర్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వలంటీర్లతో కలిపి మొత్తం 5,016 మంది సిబ్బంది తమ సేవలను అందించనున్నారు. తమ చిన్నారుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులందరూ బాధ్యతగా ఈ పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కౌశిక్‌తో కలిసి డిఎం అండ్ హెచ్‌వో పిలుపునిచ్చారు.

## స్మగ్లింగ్ రాకెట్ గుట్టురట్టు

**నలుగురు నిందితులు అరెస్టు**

**పరారీలో ప్రధాన నిందితులు**

**110 కిలోల గంజాయి స్వాధీనం**

**శంషాబాద్ జూన్27,ప్రభాతవార్త :** శంషాబాద్ జోన్ కమిషనర్ టాస్క్ ఫోర్స్, ఆదిభట్ల పోలీసుల సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీ గంజాయి పట్టుబడింది. శనివారం తన కార్యాలయంలో డిసిపి రాజేష్ ఈ వివరాలు వెల్లడించారు. తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి నగరంలో 20 వేల నుండి 30వేలకు అమ్ముతున్న అంతరాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ రాకెట్‌ను పక్కా సమాచారంతో గుట్టురట్టు చేసినట్లు తెలిపారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా 110 కిలోల గంజాయిని అక్రమంగా తరలి స్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లింగ్ ముఠాను బొంగులూరు ఓఆర్ఆర్ గేట్ సమీపంలో పట్టుకున్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేయగా, ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారు.అరెస్టయిన వారు ప్రశాంత్ గణేష్ పసల్కర్ (31), రాజేష్ హనుమంత్ లోంఢే (31), షాహాజీ గోరక్ చంగన్ (25) వీరు మహారాష్ట్రలోని శ్రీహరి లిమా (26) ఒడిశా వీరు గంజాయి రవాణాలో డ్రైవర్లు, పైలట్ వాహన డ్రైవర్లుగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుల వద్ద నుంచి 110 కిలోల గంజాయి, టాటా హారియర్, మారుతి ఎర్టిగా కార్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.56 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు.

# అనుమతి లేకుండా డుమ్మా!

**✦షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్ తనిఖీ ✦సిబ్బంది అనధికార సెలవుపై ఆగ్రహం ✦హాజరు పట్టిక పరిశీలన ✦బాధ్యతాయుతంగా ఉండాలని సూచన**

**షాద్‌నగర్, జూన్ 27, ప్రభాతవార్త :** కీలక సమయాల్లో కూడా ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను మరిచి బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ ఉద్యోగాలకు డుమ్మా కొట్టడం సరైన పద్ధతి కాదని ఆర్డీవో కార్యాలయ సిబ్బంది తీరుపై షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లింగారెడ్డిగూడ గ్రామంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నేరుగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలువురు సిబ్బంది గైర్హాజరుగా ఉండటం ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది. కార్యాలయంలో ఉద్యోగుల హాజరు పరిస్థితిని పరిశీలించిన ఆయన, సిబ్బంది హాజరు పట్టికను తెప్పించి స్వయంగా పరిశీలించారు. విధులకు హాజరుకాని ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో ఎన్.ఆర్. సరిత రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైనట్లు సిబ్బంది ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడగా, ఆమె అధికారిక విధుల్లో భాగంగా జిల్లా కార్యాలయంలో ఉన్నట్లు తెలిపారు. అయితే కీలక మరో అధికారి, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఒక డిప్యూటీ తహసీల్దార్, ఒక జూనియర్ అసిస్టెంట్‌తో పాటు మరికొందరు సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. గైర్హాజరైన ఉద్యోగులు సెలవు దరఖాస్తులు సమర్పించారా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. హాజరు పట్టికలో పేర్లు చదివిస్తూ, సంబంధిత ఉద్యోగులు ఎందుకు విధులకు రాలేదని ప్రశ్నించారు. ఒకవేళ సెలవులో ఉంటే సంబంధిత సెలవు పత్రాలను చూపించాలని కోరారు.



ఆర్డీవో కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే

కొంతమంది ఉద్యోగులు మౌఖికంగా సమాచారం ఇచ్చి వెళ్లారని సిబ్బంది చెప్పగా, ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో విధి నిర్వహణకు సంబంధించి ప్రతిదీ రికార్డుల్లో ఉండాలని, మౌఖిక సమాచారం సరిపోదని స్పష్టం చేశారు. అధికారి కార్యాలయంలో లేరనే కారణంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి. సెలవు తీసుకుంటే తప్పనిసరిగా దానికి సంబంధించిన పత్రాలు కార్యాలయంలో అందుబాటులో ఉండాలి" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని, అదే సమయంలో ప్రజలు వివిధ అవసరాల కోసం ఆర్డీవో కార్యాలయానికి వస్తుంటారని గుర్తు చేశారు. విధులకు హాజరైన సిబ్బంది వివరాలను కూడా ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గైర్హాజరైన ఉద్యోగుల పేర్లను ప్రత్యేకంగా నమోదు చేసుకొని, కార్యాలయ పనితీరుపై సమగ్ర వివరాలు సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

# విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం

**అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**

**కోట్‌పల్లి, జూన్ 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలోని కరీంపూర్ గ్రామంలో కేజీబీవీ భవనం 4,కోట్ల 15 లక్షల నిధులతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేజీబీవీ పాఠశాలల ద్వారా నిరుపేద కుటుంబాల విద్యార్థినులకు మెరుగైన విద్య, వసతి భోజనం సురక్షిత వాతావరణం కల్పిస్తున్నామన్నారు. విద్యార్థినులు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోని కష్టపడి మంచిగా చదివి ఉన్నత లక్ష్యాలను సాదించాలన్నారు. విద్య ద్వారానే సమాజంలో గౌరవ ప్రదమైన స్థానం సంపాదించవచ్చని బాలికల విద్య కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధికి కుడా తోహద పడు తుందని వారు పేర్కొన్నారు. ఈకార్య క్రమంలో వికారాబాద్ జిల్లా విద్యాధికారి మాహ మ్మద్ అబ్దుల్ ఘని, డీసీసీ జిల్లా అధ్యక్షులు ధార్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, కోట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింగ్ నాయక్, తహసీల్దార్ అనంద్‌రావు, మండల విద్యాధికారి చంద్రప్ప కేజీబీవీ పాఠశాల ప్రిన్స్‌పాల్ పల్లవి, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, ఇంజనీర్ శ్రీనివాసులు, శ్రీనివాస్, కరీంపూర్ సర్పంచు షబానా సాజిద్, కంకణాలపల్లి సర్పంచు రాజేందర్‌రెడ్డి, అయా గ్రామాల సర్పంచులు, స్థానిక కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కెజిబివి పాఠశాల భవన ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న సభాపతి



ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 27, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరుగుతున్న సర్ ప్రక్రియను శనివారం కలెక్టర్ మనుచౌదరి పర్యవేక్షించారు. హౌజింఘ్ బోర్డు, తిరుమలహిల్స్‌లో బిఎల్‌ఓలు ఇంటింటికి అందిస్తున్న ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీపై సూచనలు చేశారు. ప్రతి రోజు ఉదయం బిఎల్‌ఓల అటెండెన్స్‌ను తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ కూకట్‌పల్లి తహసీల్దార్ అశోక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. కీసర మండలం

## సర్ సవ్యంగా సాగుతోందా?

**క్షేత్ర స్థాయి తనిఖీలో అధికారులు**

యాద్గార్‌పల్లిలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఓటరు నమోదు యాప్ ద్వారా అప్‌లోడ్ చేసే ప్రక్రియను బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఇంటింటి సర్వే సమర్థవంతంగా చేయండి**

**వికారాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** జిల్లాలో జరుగుతున్న స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ఇంటింటి సర్వేను సమర్థవంతంగా, ఎటువంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆలంపల్లి వార్డులో జరుగుతున్న సర్వే తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ రెవెన్యూ అధికారి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న తండా వాసులు

# ఎండమావిగా మిషన్ భగీరథ

**నాలుగు నెలలుగా చుక్క నీరు లేక అల్లాడుతున్న ఎర్రగోవింద్ తండా**

**రోడ్డెక్కిన గిరిపుత్రులు**

**కనీసం ట్యాంకర్లు కూడా ఇవ్వడంలేదని ఆగ్రహం**

**కుల్కచర్ల, జూన్ 27 ప్రభాతవార్త :** ప్రభుత్వాలు పథకాల పేరుతో కోట్లు కుమ్మరిస్తున్నా, గిరిజన తండాల దాహార్తి మాత్రం తీరడం లేదు. కుల్కచర్ల మండల పరిధిలోని ఎర్రగోవింద్ తండా గ్రామ పంచాయతీలో తాగునీటి కష్టాలు నేడు పరాకాష్టకు చేరాయి. ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్న మిషన్ భగీరథ పథకం ఈ తండాలో గత నాలుగు నెలలుగా పూర్తిగా నిలిచిపోయింది. దీనివల్ల చుక్క నీరు దొరకక, గుక్కెడు మిగతా 2లో

# శంషాబాద్‌లో చిరుత కలకలం..

**ఆనవాళ్లను పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు- అడవిపిల్లి అడుగులుగా నిర్ధారణ**

**శంషాబాద్, జూన్ 27, ప్రభాతవార్త:** శంషాబాద్ ఎయిర్పోర్ట్ పరిసరాల్లో చిరుత సంచరిస్తోందన్న పుకార్లు స్థానికుల్లో తీవ్ర కలకలం రేపాయి. శంషాబాద్ పరిసర ప్రాంతంలోని చిన్మయ స్కూల్ సమీపంలో చిరుత కనిపించిందంటూ స్థానికుల నుంచి సమాచారం రావడంతో అటవీశాఖ అధికారులు తక్షణమే అప్రమత్తమయ్యారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వీరేశం ఆధ్వర్యంలో అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని, అడుగుజాడలు మరియు ఇతర ఆనవాళ్ల కోసం క్షుణ్ణంగా గాలింపు చేపట్టారు. అయితే, అక్కడ లభించిన ఆనవాళ్లను నిశితంగా పరిశీలించిన అనంతరం, అవి చిరుతకు సంబంధించినవి కావని అధికారులు తేల్చిచెప్పారు.

అక్కడ కనిపించిన అడుగుజాడలు అడవిపిల్లి లేదా కుక్క (డాగ్) కి సంబంధించినవిగా అనుమానిస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వీరేశం స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో చిరుత సంచారం ఏమీ లేదని అధికారులు అధికారికంగా ప్రకటించడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎయిర్పోర్ట్ పరిసర ప్రాంతాల్లో ఎవరికైనా అడవి జంతువులు కనిపిస్తే ఎలాంటి ఆందోళన చెందకుండా, తక్షణమే అటవీశాఖకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# తాండూరులో డబుల్ రచ్చ

**ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో గందరగోళం**

**ఎమ్మెల్యేను అడ్డుకున్న బిఆర్ఎస్ నేతలు**

**కౌన్సిలర్లు, పోలీసుల మధ్య తోపులాట**

**మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత**





పోలీసులు, కౌన్సిలర్ల మధ్య తోపులాట దృశ్యం, నేలపై పడుకొని నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్

**తాండూరు, జూన్ 27, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా తాండూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తీవ్ర గందరగోళానికి దారితీసింది. లబ్ధిదారుల ఎంపికపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు మరియు నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా ఈ ఎంపిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని వారు మండిపడ్డారు. శనివారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభం కాగా, అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టణంలోని 8వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ జావిద్ కాలనీ వాసులతో కలిసి పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయానికి తరలివచ్చి, కార్యాలయం ముందు బైఠాయించి నిరసన చేపట్టారు.

**ఎమ్మెల్యేకు అడ్డంగా నేలపై పడుకుని నిరసన..**

కార్యక్రమానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యేను బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నేతలు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారింది. బీఆర్ఎస్ కౌన్సిలర్ జావిద్ ఏకంగా ఎమ్మెల్యేను అడ్డుకునేందుకు నేలపై అడ్డంగా పడుకుని తన నిరసనను వ్యక్తం చేశారు. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి వారిని అక్కడి నుండి తప్పించడంతో ఎమ్మెల్యే కమిషనర్ చాంబ ర్‌లోకి వెళ్లగలిగారు. ఈ క్రమంలో డబుల్ ఇళ్ల పంపిణీలో అక్రమా లు జరుగుతున్నాయంటూ కాలనీవాసులు, మిగతా 4లో



కౌన్సిలర్లకు లబ్ధిదారుల వివరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

## పారదర్శకంగానే ఎంపిక చేశాం

**ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధి, సంక్షేమం ఆగదు**

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

**తాండూరు, జూన్ 27, ప్రభాతవార్త :** డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగానే కొనసాగుతుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసిన అభివృద్ధి, సంక్షేమం మాత్రం ఆగదని తేల్చి చెప్పారు. శనివారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ నీరజ ఆద్వర్యంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అడిషనల్ కలెక్టర్లు వెంకట చారి, ఉమాశంకర్ ప్రసాద్, మిగతా 4లో



చింతకుంటపల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించిన దృశ్యం

# ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

**చింతకుంటపల్లి సర్పంచ్ రమేష్ యాదవ్**

**కేశంపేట ,జూన్ 27, ప్రభాతవార్త:**

కేశంపేట మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని షాద్ నగర్ విజయ కార్డియాక్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ చందులాల్ రాథోడ్ సహకారంతో ఈ శిబిరాన్ని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు, కంటి సమస్యలు, చిన్నపిల్లల ఆరోగ్యం, రక్తపోటు బిపి , షుగర్ లాంటి అనేక రకాల సమస్యలకు అనుభవజ్ఞులైన వైద్యులచే పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు ఇచ్చారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో 160మంది వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు అందులో భాగంగా, 60మంది వ్యక్తులకు బిపి, 50 మంది వ్యక్తులకు షుగర్, పదిమంది వ్యక్తులకు గుండె సమస్యలు ఉన్నట్లు గుర్తించి ,తమ ఆరోగ్యాన్ని గుర్తించారు వివిధ రకాల ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి సలహాలు సూచనలు ఇచ్చారు. గ్రామ ప్రజలకు సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతోనే నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని సర్పంచ్ రమేష్ యాదవ్ తెలిపారు. ఇలాంటి శిబిరాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్, డాక్టర్స్ చందులాల్ రాథోడ్, శివ, రెడ్యానాయక్ ఉపసర్పంచ్ సంధ్య , వార్డ్ సభ్యులు మల్లేష్ యాదవ్, కళమ్మ, జంగయ్య, పంచాయతీ కార్యదర్శి మురళి, నాయకులు, గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

## ఓటరు జాబితా సవరణపై సందేహాలు వద్దు

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 27, (ప్రభాతవార్త):** ఓటరు జాబిత సవరణపై ఎలాంటి సందేహాలు ఉండవద్దని స్టేట్ బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కందుకూరి మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆర్యసమాజ్ భవనంలో బిఎల్‌లకు ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఉన్న లోపాలను సరి దిద్దడం, మరణించిన వారు, వేరే ప్రాంతాలకు మారిన వారి పేర్లను తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయడం వంటి లక్ష్యాలతో ఈ ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్ఐఆర్ ప్రక్రియను వక్రీకరించి ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని అన్నారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ అని, ఆ సంస్థ చేపడుతున్న కార్యక్రమానికి రాజకీయ రంగు పులమడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. ఈ నెల 28 వ తేదీ ఆదివారం రోజు శంషాబాద్‌లో రంగారెడ్డి జిల్లా పార్టీకార్యాలయం ప్రారంభం అవుతుంది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ వస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల కార్యకర్తలు అభిమాలు అధిక సంఖ్యలలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగం కన్వీనర్ మచ్చ సుధాకర్ రావు, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు కమ్మరి భూపాల చారి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మాల నవీన్, జిల్లా కౌన్సిల్ మెంబర్ బోయ కురుమయ్య , వీరన్నపేట్ డిప్యూటీ సర్పంచ్ పరిగి శివకుమార్, గొల్ల రాజు, గొల్ల మల్లేష్, చెనగల కృష్ణయ్య, రవీందర్ రెడ్డి భీమయ్య, వడ్ల శ్రీశైలం, లింగం, యాదగిరి ,అంజి , విట్టల్ నర్సింహులు, రామ్, ప్రశాంత్, ముర, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జర్మనీ విద్యా పర్యటనకు ఎంపికైన ప్రిన్సిపాల్

**చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆనందోత్సాహాలు**

**చేవెళ్ల, జూన్ 27, ప్రభాతవార్త :** జర్మనీ దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు మరియు ఉన్నత విద్యా సంస్థలను సందర్శించనున్న ప్రతిష్ఠాత్మక విద్యా ప్రతినిధి బృందంలో సభ్యురాలిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్ల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. కాంచనలత ఎంపిక కావడం పట్ల కళాశాల బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యా రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక విద్యా పర్యటనలో డా. కాంచనలతకి చోటు దక్కడం కళాశాలకు గర్వకారణమని వారు పేర్కొన్నారు. 2026 జూన్ 28 నుండి జూలై 6 వరకు జరగనున్న ఈ పర్యటనలో జర్మనీలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ఆవిష్కరణ కేంద్రాలను సందర్శించి విద్యా విధానాలు, పరిశోధన అవకాశాలు, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, అంతర్జాతీయ సహకార అంశాలపై అధ్యయనం చేయనున్నారు. ఈ సందర్భంగా కళాశాల డా. ఎం. రమేష్ బాబు మాట్లాడుతూ, డా. కాంచనలత ఎంపిక ఆమె విద్యా నాయకత్వానికి, విద్యా నాణ్యత పెంపుదల కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా నిలిచిందని పేర్కొన్నారు. జర్మనీలో పొందే అనుభవాలు, వినూత్న ఆలోచనలు మరియు అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులు కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యా ప్రగతికి ఎంతో ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బోధన సిబ్బంది మాట్లాడుతూ, డా. కాంచనలత నాయకత్వంలో కళాశాల అనేక విద్యా, సాంస్కృతిక మరియు పరిశోధనా కార్యక్రమాలలో విశేష పురోగతి సాధించిందని తెలిపారు. ఆమె ఈ అంతర్జాతీయ విద్యా పర్యటన ద్వారా మరిన్ని వినూత్న కార్యక్రమాలను కళాశాలలో ప్రవేశపెట్టి విద్యార్థులకు ప్రపంచ స్థాయి అవకాశాలను అందించగలరని పేర్కొన్నారు. బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు కూడా ప్రిన్సిపాల్ గారి ఎంపిక పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఆమె జర్మనీ పర్యటన విజయవంతంగా సాగి కళాశాలకు, తెలంగాణ రాష్ట్రానికి మరియు దేశానికి మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ కాంచనలత ఈ అరుదైన అంతర్జాతీయ అవకాశం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్లకు ఒక గౌరవప్రదమైన ఘట్టంగా నిలిచిందని కళాశాల కుటుంబం పేర్కొంది.

## నూతన ప్రిన్సిపల్ చరణ్ చారికి సన్మానం



**తలకొండపల్లి జూన్27, ప్రభాత వార్త:**

తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపల్ గా బాధ్యతలు స్వీకరించిన చరణ్ చారి గారినీ తలకొండపల్లి సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ శనివారం నాడు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీ కి, మండలానికి మంచి పేరు తెచ్చివిధంగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ నూకం కోటేశ్వర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ దోమ మోహన్ రెడ్డి, కాలేజీ లెక్చరర్స్ వార్డు సభ్యులు పోతుగంటి జంగయ్య, తిరుమని రవి గౌడ్, నాయిని లక్ష్మకాంత్ గౌడ్, నాయకులు కటికెల లింగం యాదవ్, రాజు రెడ్డి, దుగ్గాపురం రవి, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తా

**తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు**
**హిమాయత్ నగర్ 60 గజాల బాధితులకు**
**సంఘీభావం తెలిపిన బక్కని నరసింహులు**


తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు

**మొయినాబాద్, జూన్ 27, ప్రభాతవార్త :** ఎన్నో ఇళ్ల నుంచి పోరాటం చేస్తున్న హిమాయత్ నగర్ 60 గజాల స్థలాల బాధితుల కు అండగా ఉంటానని.. వారి సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఇల్లు ఇప్పించే బాధ్యత తనదేనని తెలంగాణ తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు పేర్కొన్నారు. గతంలో తమకు కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటామని ఆందోళన చేపడుతున్న హిమాయత్ నగర్ గ్రామస్థులకు ఆయన శనివారం సంఘీభావం తెలిపి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హిమాయత్ నగర్ గ్రామస్తులకు అండగా ఉంటుందని చెప్పారు. గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఇప్పుడు లాక్కోవడం సరికాదని.. బాధితులు ఇల్లు నిర్మించుకునేంతవరకు వారికి అండగా ఉంటామని భరోసాని ఇచ్చారు. గ్రామస్తులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సంపాదించుకోవాలని తెలిపారు. గతంలో ఎందరో మహానుభావులు పేదల కోసం అనేక ఎకరాల భూములను త్యాగం చేశారని ఇప్పుడు అవి ఎక్కడికి వెళ్లాయో తెలియదన్నారు. పేదల పక్షాన తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని భరోసాని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, హిమాయత్ నగర్ గ్రామస్థులు, యువజన సంఘాల నాయకులు ఉన్నారు.

# ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో సర్కార్ విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపి రాజేందర్

**ఘట్‌కేసర్, జూన్ 27, ప్రభాతవార్త:** తెలంగాణాలో బిజెపి శక్తి రోజురోజుకూ బలోపేతం అవుతుందని, ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా బిజెపి వైపు ఆశగా చూస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లోని రాక్ ఎన్‌క్లేవ్ కన్వెన్షన్‌లో బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్‌నబీన్ తెలంగాణ పర్యటనలో భాగంగా నిర్వహించనున్న ముఖ్య సమావేశానికి విస్తృత ఏర్పాట్లు జరుగుతుండగా ఈఏర్పాట్లను శనివారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ జిల్లా నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీ రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ సర్కార్ నెరవేర్చలేకపోయిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇప్పటికి అమలుకాక ప్రజల్లో తీవ్ర నిరాశ నెలకొన్నదని ఆయన పేర్కొన్నారు.

జ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని, అదే స్ఫూర్తితో బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్‌నబీన్ తెలంగాణ పర్యటనకు రావడం రాష్ట్ర బిజెపికి మరింత ఉత్సాహాన్ని తీసుకువస్తుందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రాబోయే ఎన్నికల్లో బిజెపిని విజయపథంలో నడిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు-మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లాల తిరుమలరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు పటోళ్ల విక్రంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొనె శ్రీనివాస్, జిల్లా మీడియా కన్వీనర్ చలువాది ప్రవీణ్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు బస్వ రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలి


ప్రత్యేక అధికారి సవ్యసాచి గోష్

**రంగారెడ్డి అర్బన్, జూన్ 27 ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సమర్థవంతంగా చేరేలా అధికారులు కృషి చేయాలని ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి, సీఎస్ఆర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి గోష్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డితో కలిసి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించడంలో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల మెరుగుదలలో విశేష ఫలితాలు సాధించాయని పేర్కొన్నారు. సాధించిన విజయాలను కొనసాగిస్తూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ పారదర్శకత, జవాబు దారీతనంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రభుత్వ సేవలు ప్రతి అర్హుడికి సకాలంలో అందేలా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు .విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం తదితర రంగాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించడం, లబ్ధిదారుల నుంచి వినతులను స్వీకరించి సత్వర చర్యలు తీసుకోవడం, ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం అధికారుల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విజయవంతంగా అమలు చేసిన జిల్లా కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులను ప్రత్యేక అధికారి అభినందించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి జిల్లాలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో చేపట్టిన చర్యలను ప్రత్యేక అధికారికి వివరించారు. అనంతరం జిల్లా శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ శాఖల పురోగతిని వివరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ప్రత్యేక అధికారి సవ్యసాచి గోష్‌కు జిల్లా కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి అనంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, వనజాత, థీమ్ నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎండమావిగా మిషన్ భగీరథ

**(మొదటిపేజీ తరువాయి)**

నీటి కోసం స్థానికులు దాహార్తితో అల్లాడు తున్నారు. వృద్ధులు, మహిళలు సైతం మైళ్ల దూరం నడిచి సమీపంలోని పంటపొలాల్లో ఉన్న ప్రైవేట్ బోర్లు, బావుల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎండనక, వాననక ప్రతిరోజూ నీటి కోసం స్థానికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా గిరిజన తండాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజల్లో అసంతృప్తి వెల్లువెత్తింది. ఈ నేపథ్యంలో శనివారం నాడు ఎర్రగోవింద్ తండా ఒక్కసారిగా నిరసనతో అట్టుడికింది. అధికారుల తీవ్ర నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తండా వాసులు ఖాళీ నీటి బిందెలతో రోడ్డెక్కి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. కనీసం తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేయకపోవడంపై మహిళలు, వృద్ధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పడుతున్న కష్టాలు కంటికి కనిపిస్తున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై ఆందోళనకారులు మండిపడ్డారు. తాగేందుకు నీరు లేక సమీపంలోని పంటపొలాల్లోని ప్రైవేట్ బోర్లు, బావుల చుట్టూ తిరుగుతూ నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం గుక్కెడు నీటి కోసం ట్యాంకర్లను కూడా ఏర్పాటు చేయని అధికార యంత్రాంగం నిద్ర మత్తు వీడి, ఇప్పటికైనా ఎర్రగోవింద్ తండాకు మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తండావాసులు హెచ్చరించారు.

# ఫార్మాసిటీ భూములను ఇతర అవసరాలకు వినియోగిస్తే బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది



**రంగారెడ్డి అర్బన్, జూన్ 27, ప్రభాతవార్త :** ఫార్మాసిటీ పేరుతో సేకరించిన భూములను రైతులకు తిరిగి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీని విస్మరించి ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త ప్రణాళికలు తీసుకురావడం ప్రజలను మోసం చేయడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.

మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఫార్మాసిటీని రద్దు చేసి భూములను రైతులకు తిరిగి ఇస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారని, కానీ ఇప్పటివరకు గజం కాదు, ఇంచు భూమి కూడా రైతులకు తిరిగి ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో భారీ స్థాయిలో భూముల సేకరణకు ప్రయత్నిస్తోందని, ఇది పూర్తిగా రియల్ ఎస్టేట్ వ్యాపార ప్రయోజనాల కోసమే జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు భూములపై దృష్టి పెట్టారని, 14 వేల ఎకరాల నుంచి ఇప్పుడు 30 వేల ఎకరాల వరకు భూములను వినియోగించాలనే యత్నం జరుగుతోందని అన్నారు.

అమెరికాను మించిన నగరం నిర్మిస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి ముందుగా తన రాజకీయ భవిష్యత్తు గురించి ఆలోచించుకోవాలి. ఆయన ఫ్యూచర్‌కే దిక్కు లేదు అంటూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఫార్మాసిటీ కోసం మాత్రమే భూసేకరణ జరిగిందని, ఆ భూములను జూ పార్క్, డేటా సెంటర్ లేదా ఇతర ప్రాజెక్టుల కోసం వినియోగించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలకు బీఆర్ఎస్ పార్టీ అంగీకరించదని, అవసరమైతే చట్టపరంగా కూడా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్న పెట్టుబడిదారులు ముందుగా చట్టపరమైన అంశాలను పరిశీలించాలని సూచించిన కేటీఆర్, ప్రభుత్వ హామీలను మాత్రమే నమ్మి ముందుకు వెళ్తే నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, శ్రీనివాస్, శంభుపూర్ రాజు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కెటిఆర్ సభకు భారీ సంఖ్యలో బయలుదేరాలి

**మండల పార్టీ అధ్యక్షులు దబ్బని వెంకట్**

**మోమిన్‌పేట్, జూన్ 27. ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు కేటీఆర్ నేడు వికారాబాద్ పట్టణంలోని ఎన్నేపల్లి గౌలీకార్ ఫంక్షన్ హాల్లో జరిగే కార్యకర్తల సమావేశానికి వికారాబాద్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదేశాల మేరకు మోమిన్‌పేట్ మండలం నుండి భారీ సంఖ్యలో బయలుదేరాలని మండల పార్టీ అధ్యక్షులు దబ్బని వెంకట్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం మండల కేద్రంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతు బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నిర్వహిస్తున్న ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు సబితాఇంద్రారెడ్డి, మరియు పార్టీ ప్రధాన కార్యధర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొంటారని అన్నారు. కనుకా మోమిన్‌పేట్ మండలం నుండి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉదయం 8, ఎనిమిది గంటలకు మోమిన్‌పేట్ మండల కేంద్రంనుండి భారీ సంఖ్యలో బయలుదేరి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సమగ్ర ఓటరు జాబితా సవరణకు ఇంటింటి సర్వే ప్రారంభం


1వ వార్డులో ఇంటింటికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రారంభించిన దాదె మహేష్

**షాబాద్, జూన్ 27, ప్రభాతవార్త :** సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్2026) కార్యక్రమాన్ని తెలంగాణలో ప్రారంభించిన నేపథ్యంలో, కుర్వగూడ గ్రామంలో 1వ వార్డులో దాదె మహేష్‌తో పాటు సర్పంచ్ బుయ్యని సంధ్యారాణి ,వార్డు సభ్యులు ప్రవీణ్ , పంచాయతీ కార్యదర్శి గీతలతో కలిసి ఎన్యూమరేషన్ ఫారాలను ఇంటిం టికి వెళ్లి ఓటర్లకు పంపిణీ చేశారు. సర్వే నిర్వహిస్తున్నటు వంటి (బి ఎల్ వో) అధికారులకు ఓటరు సమగ్ర సమాచారం అందిచ్చి వారికి సహకరిచాగలరు అని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలోవార్డు సభ్యులు శ్యామ్ సుందర్, సుమలత జంగయ్య, పద్మ, పాల్గొన్నారు.



నీట్ పరీక్షల పేపర్ లీకేజీను నిరసిస్తూ
ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# నీట్ పేపర్ లీకేజీకి నిరసన

**శంషాబాద్ ,జూన్27, ప్రభాతవార్త :**

నీట్ పరీక్షల పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో ఆందోళన కార్యక్రమం నిర్వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కొండకళ్ళ నాగేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లుగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో పలు పోటీ పరీక్షల పేపర్ లీకేజీలు జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన నీట్ పరీక్ష కూడా పేపర్ లీకేజీకి గురికావడం దురదృష్టకరమన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా అనేక మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల జీవితాలతో ఆటలాడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నటికీ క్షమించరని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చిన్న పిల్లలకు పోలియో చుక్కలు తప్పని సరి

**మండల వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్**

**కుల్కచర్ల, జూన్ 27, ప్రభాతవార్త:** ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పని సరి వేయించాలని మండల వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రం లోని పోలియోపై వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలి నిర్వహించారు. పోలియో చుక్కలు తప్పని సరి వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పోలియో పై అవగాహన ర్యాలీ

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి


పోలియో ర్యాలిలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి సుధాకర్ లాల్

**దోమ ,జూన్, 27 ప్రభాతవార్త:** ప్రాథమీక ఆరోగ్య కేంద్రంకు వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి సుధాకర్ లాల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకు ముందు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పని సరి వేయించాలని పోలియోపై వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా అసుపత్రిలో రికార్డులు పరిశీలించి వార్డులను ,పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...అసుపత్రికి వచ్చే ప్రజలకు మేరుగైన వైద్య సేవలుఅందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయ పాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిలో గ్యామా నాయక్, డాక్టర్ రాజిత, సిఎచ్ఒ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కార్యాలయాన్ని చేవెళ్లలోనే కొనసాగించాలి


మాట్లాడుతున్న వెంకటేష్ గౌడ్

**షాబాద్, జూన్ 27, ప్రభాతవార్త :** షాబాద్ మండల ఎక్సైజ్ (ఎస్‌హెచ్‌వో) కార్యాలయాన్ని చేవెళ్ల నుంచి షాద్‌నగర్‌కు మార్చే ప్రతిపాదనను వెంటనే ఎక్సైజ్ శాఖ విరమించాలని షాబాద్ మండల గౌడ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన షాబాద్ లో విలేకరులతో మాట్లాడుతూ.. షాబాద్ మండలానికి గత ఐదు దశాబ్దాలుగా చేవెళ్లలోనే ఎక్సైజ్ (ఎస్‌హెచ్‌వో) కార్యాలయం కొనసాగుతోందని, ప్రస్తుతం దానిని షాద్‌నగర్‌కు మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ నిర్ణయం అమలైతే మండలంలోని గీత కార్మికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. షాబాద్ మండలం చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోనే ఉండటంతో పాటు ఆర్డీఓ కార్యాలయం, ఏసిపి కార్యాలయం, కోర్టు తదితర ప్రభుత్వ కార్యాలయాలు కూడా చేవెళ్లలోనే ఉన్నాయని గుర్తు చేశారు. ఎక్సైజ్ కార్యాలయాన్ని మాత్రమే షాద్‌నగర్‌కు మార్చడం వల్ల ప్రజలు ప్రభుత్వ పనుల కోసం రెండు ప్రాంతాలకు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. అందువల్ల షాబాద్ మండల ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్సైజ్ (ఎస్‌హెచ్‌వో) కార్యాలయాన్ని యథాతథంగా చేవెళ్లలోనే కొనసాగించాలని, మార్పు నిర్ణయాన్ని వెంటనే విరమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును షాబాద్ మండల గీతా కార్మికుల తరపున వెంకటేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

**IN THE HON'BLE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT L.B. NAGAR**
**O.S. No.349 OF 2024**

**Between:**
State Bank of India,
PPB Vaidehinagar Branch,
Ranga Reddy.
**...Plaintiff**
**And**
Vadthya Kishan
**...Defendant**

To
Vadthya Kishan S/o. Roopla, Aged about 59 years, Occ: Employee, D.No. 3-48, Madanpalle Patha Thanda, Madanpalle, Ranga Reddy Dist, Telangana -509325.

Please take notice that as you are evading taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate at 10-30 AM on 09-07-2026 in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.

**SMT. RAPAKA ARUNA,**
B.A, B.L.,
Advocate
# 11-41/4, Pragathinagar,
Gaddiannaram,
Hyderabad-500 060.

## లయన్స్‌క్లబ్ అధ్యక్షునిగా ఎంగలి బాలకృష్ణ

**ఆమనగల్లు, జూన్27, ప్రభాతవార్త:** లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు నూతన అధ్యక్షునిగా ఎంగలి బాలకృష్ణ నియమితులయ్యారు. జూలై 1న స్థానిక కళ్యాణి గార్డెన్స్‌లో నూతన కార్యవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. 41వఅధ్యక్షునిగా ఎంగలి బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా, జి. శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా గంప శ్రీనివాసులు, క్లబ్ పిఆర్‌ఓగా ఎంఎ పాషతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేయనున్నారు. అలాగే లయన్స్‌క్లబ్ అనుసంధానమైన లియో క్లబ్ అధ్యక్షునిగా శ్యాంసుందర్, కార్యదర్శిగా శశిధర్, కోశాధికారిగా ధర్మేంధర్ ప్రమాణం చేయనున్నారు. కాగా ప్రమాణ స్వీకారానికి అతిథులుగా లయన్ జిల్లా గవర్నర్లు డాక్టర్ జి. మహేందర్‌కుమార్‌రెడ్డి, మల్టిపుల్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ గవర్నర్లు చెన్నకిషన్‌రెడ్డి, జూలూరు రమేశ్‌బాబు, రీజియన్ చైర్ పర్సన్ లయన్ ప్రశాంత్‌రెడ్డి, జోన్ చైర్మన్ బండేలా రాంచంద్రారెడ్డి, దామోదర్‌రెడ్డిలు హాజరవుతున్నట్లు పిఆర్‌ఓపాష ఒక ప్రకటనలో తెలిపారు.


అన్నోజిగూడ ఎల్ఐజీ కాలనీ రోడ్డులో మంచినీటిపైపులైన్‌కు మున్సిపల్ సిబ్బంది చేపట్టిన మరమ్మత్తు పనులను పరిశీలిస్తున్న మాజీ కౌన్సిలర్ రాజశేఖర్ తదితరులు.

## అన్నోజిగూడలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 27, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ శ్రీలక్ష్మీ నర్సింహ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి పైపులైన్ మరమ్మత్తులు కార్పోరేషన్ సిబ్బంది చేపట్టారు. లక్ష్మీనర్సింహ కాలనీ, ఎల్ఐజీ కాలనీవాసులు తాగునీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా స్థానిక నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ బి. కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు పాడైపోయిన పైపులైన్ పనులకు మరమ్మత్తు చేపట్టినట్లు మాజీ కౌన్సిలర్ చింతల రాజశేఖర్ తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మాజీ కౌన్సిలర్ అన్నారు. నీటి ఎద్దడి తీర్చడానికి జలమండలి అధికారులు అదనంగా నీటి కేటాయింపులు చేసి సరఫరా చేయాలని జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## జూలై 5లోపు రైతు భరోసా దరఖాస్తులు చేసుకోవాలి

**మండల వ్యవసాయ అధికారి పి. కవిత**

**కడ్తాల్, జూన్27, ప్రభాతవార్త:** కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన కడ్తాల్ మండల పరిధిలోని గ్రామాల్ల రైతులు, రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని శనివారం మండల వ్యవసాయ అధికారి పి. కవిత ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాసు బుక్ జిరాక్స్, బ్యాంకు ఖాతా పాస్‌బుక్ జిరాక్స్‌తోపాటు మొబైల్‌నంబర్ వివరాలను సమర్పించాలని సూచించారు. అర్హులైన రైతులు జూలై 5వ తేదీ లోపు సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారులను లేదా మండల వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రైతు భరోసాకోసం దరఖాస్తు చేసుకోండి

**: ఏఓ లావణ్య**

**పూడూరు, జూన్ 27, ప్రభాతవార్త :** పూడూరు మండలంలో జూన్ 15వతేదీలోపల భూమిని పట్టా చేసుకున్న వివిధ గ్రామాలకు చెందిన రైతులు జూలై 4వతేదీలోపు రైతు భరోసాకోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నింపిన రైతు భరోసా దరఖాస్తు ఫారానికి పట్టా దారు పాసుపుస్తకం జిరాక్స్‌తోపాటు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్‌లను జతచేసి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఇంతవరకు రైతుభరోసా అందని రైతులు సధ్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## సర్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**


నందిగామ చంద్రాయనగూడలో సర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నందిగామ, జూన్ 27, ప్రభాతవార్త :** కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ నమోదుకు ప్రతిపాదించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. సర్ ఓటర్ జాబితా సవరణలో కాంగ్రెస్నని నందిగామ మండలం చంద్రాయన్ గూడకు ఎన్యుమరేషన్ సర్ వచ్చిన ఆయన బిఎల్ఓ ఉమారాణిని ఒకడు ప్రోగ్రెస్‌ని అడిగి తెలుసుకున్నారు. సర్ ఓటర్ జాబితా కాంగ్రెస్ బూతు ఏజెంట్లు విధిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సైదులు, మాజీ ఎంపీపీ ఏం శివశంకర్ గౌడ్, సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు, కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల్ల బాల్ రెడ్డి, వార్డు సభ్యులు చిరసాని సుమలత నర్సింహులు, బొమ్మగళ్ళ నర్సింలు, టైలర్ కృష్ణ, లింగం నాయక్, డైరెక్టర్ కుందారం వెంకటరెడ్డి, నందిగామ ఎస్సై దేవరాజ్, నాయకులు మాజీ సర్పంచ్ కావలి కృష్ణ, మోహన్ రెడ్డి, బి జంగయ్య గౌడ్, చించేటి కృష్ణ, పిట్టల రాములు, ఎర్రగారి రమేష్, కావలి నర్సింలు, కెశముని రామచంద్రి, తదితరులు ఉన్నారు.

## ప్రజలందరూ సుఖంగా ఉండాలి

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 27, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలో ప్రజందరు సుఖసంతోషాలతో ఉండాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్ అన్నారు. శనివారం మండలంలో ఊరేగించిన పీర్ల వద్ద ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలందరూ ఐక్యంగా ఉండి మొహారం పండుగను ఘనంగ జరుపుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అక్రమ్, జబ్బార్, గోపాల్, శేఖర్, శివరాజ్, అన్వర్, రాహుల్, రామస్వామి, చంద్రమౌళి, రాజు, రాములు, నవీన్, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు చెల్లించాలని
# 30న కాలేజీల బంద్

**మేడ్చల్, జూన్ 27, ప్రభాతవార్త :**

ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న బిసి సేన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కళాశాలల బంద్ నిర్వహిస్తున్నామని బిసి సేన విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు గోదా అరుణ్ యాదవ్ తెలిపాడు. మేడ్చల్‌లో ఆయన మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తుందని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదని, ఈ నెల 30న రాష్ట్రవ్యాప్త కాలేజీల బంద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు, అదే విధంగా అదే రోజున కలెక్టరేట్, ఆర్డిఓ, ఎమ్మార్ఓ కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. రూ. 8 వేల కోట్ల రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, విద్యార్థులను ఆదుకోవాలన్నారు.

# ఓటు మీ హక్కు ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనండి


యాద్గార్‌పల్లిలో ఎస్ఐఆర్‌పై బిఎల్‌ఓలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**కీసర, జూన్27, ప్రభాతవార్త:**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకుని ఎన్నికల్లో పాల్గొనడం బాధ్యతగా భావించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కీసర సర్కిల్ పరిధిలోని యాద్గార్‌పల్లి గ్రామంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ఎన్‌రోల్‌మెంట్ పత్రాలు ఇచ్చారని, ఒక్కొక్కరికి ఎన్ని ఎన్‌రోల్‌మెంట్ పత్రాలు ఇస్తున్నారని, ఎన్‌రోల్‌మెంట్ యాప్ ద్వారా అప్ లోడ్ చేసే ప్రక్రియను బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరికి రెండు పత్రాలు అందజేస్తున్నామని, సెల్‌ఫోన్‌లో క్యూ ఆర్ కోడ్ ద్వారా అప్ లోడ్ చేస్తున్నామని బిఎల్‌ఓలు వివరించారు. పత్రాలు ఇచ్చిన తరువాత తప్పనిసరిగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో తహశీల్దార్ యాదగిరిరెడ్డి, ఆర్ఐ మహేందర్, బిఎల్‌ఓలు

# ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట

**మేడ్చల్, జూన్ 27, ప్రభాతవార్త :** ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిలు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి, ఎల్లంపేట్ మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి, వైస్ ఛైర్మన్ రజిత, కౌన్సిలర్లు భాస్కర్, శారద రాజు నాయక్, మహేశ్వరి రాజేష్, అర్చన శ్రీనివాస్, నాయకులు పోచయ్య, మల్లికార్జున్ ముదిరాజ్, జగన్‌రెడ్డి, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.


స్వామి వారిని దర్శించుకున్న ఎంపి ఈటల రాజేందర్

# భూసేకరణ రైతులకు నష్టపరిహారం చెల్లించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

**పెద్దేముల్, జూన్ 27, ప్రభాతవార్త:** కోటపల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణకు భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని భాధిత రైతులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం తాండూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కలిసి పెద్దేముల్, తింసాన్‌పల్లి గ్రామాల రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా రైతులు నరేష్‌రెడ్డి, చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి, నల్లా రంగారెడ్డి, పగిడ్యాల వెంకట్‌రెడ్డి, తింసాన్‌పల్లి శ్రీనివాస్. సంజీవ్, కేసి లక్ష్మప్ప, గౌడి శ్రీశైలం, బంటు క్రిష్ణ. నందారెడ్డి, ద్యావరి రాఘవేందర్, పి. నర్సింహరెడ్డి, ద్యావరి మహేష్ తదితరులు మాట్లాడుతూ గతంలో కోటపల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణం కోసం సేకరించిన భూముల్లో మిగిలి ఉన్న సుమారు 25 ఎకరాల భూమికి సంబందించిన పెండింగ్ నష్టపరిహారాన్ని తక్షణమే మంజూరు చేయాలని అన్నారు. మా కుటుంబాలకు ఆధారమైన భూములను కోల్పోయి ఎన్నో సంవత్సరాలు గడిచిన నష్టపరిహారం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ఈ భూములకు సంబందించి ఎక్కువ మంది రైతులకు నష్టపరిహారం అందినప్పటికి ఇప్పటికి సుమారు 25 ఎకరాల భూమికి సంబందించి పెండింగ్‌లో ఉందని అన్నారు. రైతుల సంక్షేమానికి మీరు ఎల్లప్పుడు అండగా నిలుస్తున్న ప్రజాప్రతినిధిగా, తమ విజ్ఞప్తిని సానుభూతితో పరిశీలించి న్యాయం చేస్తారని ఆశీస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి తక్షణమే తమకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సంబందిత అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా కృషిచేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.


మామిడి తోటల కత్తిరింపు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

## మామిడి తోటల శాస్త్రీయ కత్తిరింపు పై అవగాహన

**కేశంపేట, జూన్ 27 ,ప్రభాతవార్త :**

మామిడి తోటల కత్తిరింపు పద్ధతులపై అవగాహన సదస్సును శనివారం కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ స్కల్గు పరిధిలోని ఫ్రూట్ రీసెర్చ్ స్టేషన్ ఎఫ్ ఆర్ ఎస్ సంగారెడ్డి కి చెందిన శాస్త్రవేత్తలు శనివారం , కేశంపేట పరిధిలోగల పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన రైతు డా. రంగా రెడ్డి ఫార్మ్‌లో మామిడి తోటల కత్తిరింపు శాస్త్రీయ పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కత్తిరింపులకు సంబంధించిన పరికరాలను కత్తిరింపు విధి విధానాలను రైతులకు తెలియజేశారు. బిర్లా సైన్స్ సెంటర్ డైరెక్టర్ డా. కె. మృత్యుంజయ రెడ్డి సుమారు 20 ఎకరాల్లో మామిడిని సాగు చేస్తూ, రైతులు అందరికీ ఆదర్శంగా నిలిచారు ఈ కార్యక్రమంలో, మామిడి తోటలలో శాస్త్రీయ కత్తిరింపు యొక్క ప్రాముఖ్యతను వివరించి, అధిక సాంద్రత మామిడి తోటలలో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అక్కడి రైతులకు అవగాహన కల్పించేందుకు ట్రాక్టర్‌తో నడిచే ట్రీ ప్రూనర్‌ను ఉపయోగించి కత్తిరింపు పద్ధతులను మామిడి రైతులకు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. వీణా జోషి మరియు స్కల్గు శాస్త్రవేత్త డా. జె. శంకర్‌స్వామి సహా యూనివర్సిటీ సిబ్బంది . పి. హిమ బిందు, ఉద్యాన అధికారి, షాద్‌నగర్, రాజేష్, హెచ్ ఈ ఓ , కేశంపేట మండల పరిధిలోని చుట్టుపక్కల ప్రాంతాల నుండి మామిడి రైతులు ఈ ప్రదర్శనలో పాల్గొని, యాంత్రిక కత్తిరింపు పరికరాల వినియోగం మామిడి ఉత్పాదకతను మెరుగుపరచడానికి శాస్త్రీయ కానోపి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి గూడ గ్రామం తో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు


విత్తన మేళాలో పాల్గొన్న అధికారులు, రైతులు, నాయకులు

**కేశంపేట ,జూన్ 27, ప్రభాతవార్త :**

నాణ్యమైన విత్తనాల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు అని ఇప్పలపల్లి ఏఈఓ రాజేశ్వరి తెలిపారు. శనివారం కేశంపేట మండల పరిధిలోని మండలంలోని ఇప్పలపల్లి రైతు వేదికలో విత్తన మేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇప్పలపల్లి సర్పంచ్ మంద మంజుల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఈఓ రాజేశ్వరి మాట్లాడుతూ రైతులు మేలు జాతి, ధ్రువీకరించబడిన విత్తనాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు తెలిపారు. వాతావరణ శాఖ ఈ ఖరీఫ్ సీజన్లో వర్షాపాతం తక్కువగా ఉంటుందని రైతులు ఈ విషయాన్ని గమనించి రైతులందరూ ఆరుతడి పంటలైన కందులు, పెసర్లు, మినుములు లాంటి పప్పు జాతి పంటలను పండించాలని రైతులకు సూచించారు .అనంతరం సర్పంచ్ మంద మంజుల మాట్లాడుతూ రైతు వేదికలో విత్తనమేల నిర్వహించడం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగించుకొని అధిక దిగుబడులను సాధించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురముని పద్మ రైతులు కుమార్ రెడ్డి, రామస్వామి, కృష్ణయ్య, వెంకటేష్ విత్తన డీలర్లు అశోక్, చంద్రమౌళి గ్రామంలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును కాపాడుకుందాం.. బోగస్ ఓట్లను అరికడదాం

**కొత్తూరు, జూన్ 27, (ప్రభాత వార్త):**

అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని కొత్తూరు మున్సిపల్ బీఎల్ఏ ఇన్‌చార్జులు, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ సర్పంచ్ కావాలి కృష్ణ పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాల మేరకు కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని 9, 10 పోలింగ్ బూత్‌లలో ఇంటింటి ఎస్ఐఆర్ సర్వేను బీఎల్‌వోలతో కలిసి ప్రారంభించారు.


ఎస్ఐఆర్‌పై సమావేశమైన నాయకులు

ఈ సందర్భంగా కొత్తూరు మున్సిపల్ బీఎల్ఏ ఇన్‌చార్జులుగా శివశంకర్ గౌడ్, కావాలి కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కొత్తూరు పాత మున్సిపల్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో సమావేశమై ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, బోగస్ ఓట్ల నమోదు, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా తీసు కోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తారని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని, నిరక్ష్యం చేస్తే ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండాగూడెం సుదర్శన్ గౌడ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవేందర్ ముదిరాజ్, కమ్మరి జనార్ధన్ చారి, మాజీ సర్పంచ్ జగన్, కర్రోళ్ల సురేందర్, చిలకమర్రి నరసింహ, వన్నాడ శివశంకర్ గౌడ్, పెద్దిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, భరత్ గౌడ్, శివ, చింత సాయి తేజేశ్వర్, అంజి నాయక్, కొండారెడ్డి సుమన్, నరసింహ గౌడ్, హస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

**కుల్కచర్ల, జూన్ 27, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉంటాయని సర్పంచ్ రవిందర్ నాయక్ అన్నారు. శనివారం మండల పరధిలోని చెరువుముందలి తాండ(ఎ) గ్రామ పంచాయతీలోపంచాయతీ కార్యదర్శి లలిత, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్‌పై అవగాహన

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 27,(ప్రభాతవార్త):** ఎస్ఐఆర్‌పై జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చింతకుంటతాండలో శనివారం సర్పంచ్ దేవి రామ్ చరణ్ గిరిజనులకు అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీ పరిధిలోని తండాల్లో బిఎల్ఓ నవీన్ కుమార్ తో కలిసి ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం తో బోగస్ ఓట్లు, మరణించిన వారి పేర్లను తొలగిస్తున్నారని, మీ ఓటు హక్కు భద్రంగా ఉందో లేదో సరిచూసు కోవడం, ఓటు వివరాలను తనిఖీ చేసుకోవడం, కొత్తగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని సూచిం చారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మ కంగా తీసుకున్నటువంటి ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని గుర్తించాలన్నారు. బిఎల్ఓల ద్వారా పొందిన ఫారాలలో తమ పూర్తి సమాచారాన్ని అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ మండల అధ్యక్షుడు రామ్ చరణ్, గ్రీన్ చాలెంజ్ మండల కోఆర్డినేటర్ వినోద్ నాయక్, గ్రామస్తులు ఉన్నారు.


తాండా వాసులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ దేవి రామ్‌చరణ్


విద్యుత్ లైట్లు ప్రారంభిస్తున్న నాయకులు

## దేవాలయంలో కరెంట్ ఫిట్టింగ్

**తలకొండపల్లి, జూన్ 27, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో విద్యుత్ లేక భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్ తను సొంతంగా రూ.23 వేలు వెచ్చించి ఆంజనేయ స్వామి దేవాలయంలో విద్యుత్ దీపాల వైరును ఫిట్టింగ్ చేయించారు. గత పదిసంవత్సరాలుగా నిరుపయోగంగా విద్యుత్ లైట్లు లేకపోవడంతో భక్తులు గ్రామస్తులు అనేక అసౌకర్యానికి గురయ్యారు. దేవాలయంలో పూజల నిమిత్తం వచ్చే భక్తులకు అనేక ఇబ్బందులు కలగడంతో గమనించిన సర్పంచ్ నూతనంగా వైర్ల రన్ ఫిట్ చేయించి దేవాలయంలో విద్యుత్ లైటులను ఏర్పాటు చేశారు. సర్పంచిని భక్తులు గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్, ఉప సర్పంచ్ అంబటి వెంకటేష్ వాలీబాల్ యూత్ ప్రెసిడెంట్ పులిజాల మహేష్ వార్డు సభ్యులు అంబటి నరసింహ అంబటి మల్లేష్ స్వామి గౌడ్ రమేప్రాములుతదితరులున్నారు.


22 సిమెంట్ పంపిణీ చేస్తున్న నాయకులు

## నిరుపేద ఇంటికి సిమెంట్ పంపిణీ

**తలకొండపల్లి, జూన్ 27, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుండ్రాతి అలివేలు అనే నిరుపేదకు శనివారం నాడు ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా సిమెంటు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన గుండ్రాతి అలివేలు నిరుపేదరాలు కావడంతో ఇంటినిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు గురికావడంతో తమ ఇంటి నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో మాజీ ఎంపిపి తిరుమని నిర్మల శ్రీశైలం గౌడ్ మాజీ ఎంపిపి తిరుమని నిర్మల శ్రీశైలంగౌడ్ సహ కారంతో ఉప్పలచారిటబుల్ ట్రస్ట్ నుంచి ఆమెకు ఉచితంగా సిమెంటును పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తిరుమని నిర్మల శ్రీశైలం గౌడ్ స్థానిక సర్పంచ్ పసుపుల మల్లేష్ లబ్ధిదారులు ఉన్నారు.

## చీపునుంతల ఉప సర్పంచ్‌కు షో-కాజ్ నోటీస్

**తలకొండపల్లి, జూన్ 27, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండలంలోని చీపునుంచల గ్రామ ఉప సర్పంచ్ గుమ్మడి రాజుకు శనివారంనాడు రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి వి. సురేష్ మోహన్ షోకాజ్ నోటీస్ అందజేశారు. నోటీసు వివరాల ప్రకారం గ్రామ ఉపసర్పంచిగా ఉన్న గుమ్మడి రాజు గ్రామ పంచాయతీ తీర్మానాలు, అభివృద్ధి పనుల చెక్కుల చెల్లింపులో నిరాకరణ, నాన్చివేత ధోరణి ప్రదర్శించడంతో ఆయనకు షోకాజ్ నోటీసు అందజేసినట్లు నోటీసులో పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు ఉప సర్పంచ్ గుమ్మడి రాజుపై గత నెలలో జిల్లా పంచాయతీ అధికారి విచారణ చేపట్టి షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు తెలిసింది. షోకాజ్ నోటీసు అందిన ఏడు రోజులలో జిల్లా అధికారులకు సమాధానం తెలిపాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.



## శివారు గ్రామాల అభివృద్ధి... ప్రభుత్వ ధ్యేయం!

**కొందుర్గు ,జూన్ 27, ప్రభాతవార్త :** మార్మల శివారు గ్రామాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొవ్వూరు పురుషోత్తం రెడ్డి అన్నారు. శనివారం నాడు ఆయన మండల పరిధిలోని లక్ష్మీ దేవునిపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు 10 లక్షల తో చేపట్టే సిమెంట్ నిర్మాణం పనులకు ఆయన గ్రామ సర్పంచ్ పసుపుల దామోదర్ తో కలిసి భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం ప్రజా పాలనలో కేటాయిస్తుందని అన్నారు.

గ్రామ అభివృద్ధి కోసం పది లక్షల రూపాయలు స్థానిక శాసనసభ్యులు మంజూరు చేశారని ఆయన అన్నారు. ఒక నాలుగు రోజుల క్రితం ఈ గ్రామంలోనే భూ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే, మళ్లీ ఇదే గ్రామానికి రోడ్డు నిర్మాణం కోసం పదిలక్షల కేటాయించడం గ్రామస్తుల అదృష్టం అన్నారు. గ్రామ సర్పంచ్ పసుపుల దామోదర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం తొలివిడతగా 10 లక్షల కేటాయించడం పట్ల గ్రామ స్తుల తరఫున ఆయన ఎమ్మెల్యే శంకరయ్యకు, మండల పార్టీ నాయకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ ఏ కృష్ణారెడ్డి, గోవర్ధన్ గౌడ్ మాజీ సర్పంచ్ పసుపుల నర్సింలు, పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నా కుమారుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించండి

**పెద్దేముల్, జూన్ 27, ప్రభాతవార్త:** తన కుమారిడిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని భాధితుని తల్లి బోయిని సంగమ్మ తెలిపారు. పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన బోయిని సంగమ్మ తెలిపిన వివరాల ప్రకారం..తన కుమారుడు రామ్ ప్రసాద్ గత రెండున్నర సంవత్సరాలుగా తమ గ్రామానికి చెందిన శోభారాణి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తు జీవనోపాధి పొందుతున్నాడని అన్నారు. అయితే శోభారాణి కుమారుడు వీరేశంకు, తన కుమారునికి మద్య వ్యక్తిగత వైరాలు ఉన్నందున, ఈ నెల 24 నాడు రామ్‌ప్రసాద్‌ను తాండూరులోని ఒక గెస్ట్ హౌస్‌కు తీసుకెళ్ళి దాడి చేశారని ఆందోళన వ్యక్తంచేశారు.

తదుపరి ఈ నెల 26 నాడు రాత్రి 9.30 గంటలకు తన కుమారుడు రామ్‌ప్రసాద్ గ్రామంలో శంకర్ దుకాణానికి వెళ్ళి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్ళాడని తెలిపారు. కొంత సేపటి తరువాత తన కుమారుడి స్నేహితుల ద్వారా తెలిసిన విషయమేమనగా తాండూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చి రామ్‌ప్రసాద్‌పై కర్రలతో దాడిచేసి బలవంతంగా కారులో ఎక్కించుకొని తాండూరు వైపు తీసుకెళ్ళారని తెలిపారు. అందువల్ల తన కుమారుడిని అపహరించి దాడిచేసిన నిందితులపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు తెలిపారు.

బాధితురాలు సంగమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ తెలిపారు.

# యువత భవిష్యత్తుకు మాదకద్రవ్యాలే పెద్ద శత్రువు

**నందిగామ సబ్ ఇన్స్పెక్టర్ దేవరాజ్ పిలుపు**

**నందిగామ, జూన్ 27, ప్రభాతవార్త :** విద్యార్థి భవిష్యత్తు మత్తులో కాదు లక్ష్యంపై ఉండాలని, యువత ఉజ్వల భవిష్యత్తుకు మాదక ద్రవ్యాలే పెద్ద శత్రువు అని నందిగామ సబ్ ఇన్స్పెక్టర్ దేవరాజ్ పిలుపు ఇచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం ఆయన చంద్రాయన గూడలో మాట్లాడారు. మాదక ద్రవ్యాల దుష్ప్రభావం పై యువతకు శుక్రవారం ఉదయం ఆయన యువతకు, కార్మికులకు , విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు మాదక ద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును పూర్తిగా నాశనం చేస్తుందని విద్యార్థులు, యువత వీటికి దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల తలెత్తే శారీరక ,మానసిక, సామాజిక పరిణామాలపై యువతకు, కార్మికులకు, విద్యార్థులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. యువతను చైతన్య పరుస్తూ ఆయన చెప్పిన మాటలు యువతను జాగృతం చేశాయి. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# గానుగాపూర్ దత్తాత్రేయ క్షేత్ర దర్శన యాత్రకు ప్రత్యేక బస్సు



**షాద్‌నగర్, జూన్ 27, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) షాద్‌నగర్ డిపో ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం గానుగాపూర్ శ్రీ దత్తాత్రేయ స్వామి దర్శన యాత్రకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఈ ప్రత్యేక యాత్ర జూన్ 29, 2026 సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు షాద్‌నగర్ డిపో నుంచి బయలుదేరి గానుగాపూర్ చేరుకోనుంది. తిరుగు ప్రయాణంలో జూన్ 30 ఉదయం 5 గంటలకు గానుగాపూర్ నుంచి బయలుదేరి షాద్‌నగర్‌కు చేరుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ యాత్రకు ఒక్కో ప్రయాణికుడికి కేవలం రూ.700 టికెట్ చార్జీగా నిర్ణయించారు. అయితే పలహారం, భోజనం, వసతి తదితర ఖర్చులను భక్తులు స్వయంగా భరించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. గానుగాపూర్ శ్రీ దత్తాత్రేయ స్వామి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ప్రత్యేక యాత్రలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని డిపో అధికారులు కోరారు. టికెట్ బుకింగ్ మరియు వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 9959226287 9182645281 94408389859491166785

# ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకోత్సవ వేడుకలు

**శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు**

**షాద్‌నగర్, జూన్ 27, ప్రభాతవార్త :** ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకోత్సవాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, 1674లో రాయగడ్ కోటలో జరిగిన ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం భారత చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. స్వరాజ్య సాధన కోసం శివాజీ మహారాజ్ చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని కొనియాడారు. హైందవ స్వరాజ్య స్థాపనకు శ్రీకారం చుట్టిన శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, దేశభక్తి, ప్రజాహిత పాలన నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. పరిపాలనలో దూరదృష్టి, ప్రజల పట్ల అంకితభావం, రాజధర్మాన్ని పాటించిన గొప్ప నాయకుడిగా శివాజీ మహారాజ్ చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. ప్రస్తుత యువత శివాజీ మహారాజ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్, కౌన్సిలర్ జమాల్పూర్ సంతోషి చందూలాల్, పెంటయ్య, ఇబ్రహీం, మహబూబ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## తాండూరులో డబుల్ రచ్చ

(మొదటి పేజీ తరువాయి)

కౌన్సిలర్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట కొనసాగింది. ఆ తర్వాత అందరినీ లోపలికి అనుమతించడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

**ఆందోళనల మధ్యే ఎంపిక ప్రక్రియ ప్రారంభం**

కమిషనర్ కార్యాలయం ముందు బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడిచింది. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేయగా, కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యేకు అనుకూలంగా నినాదాలు చేస్తూ పోటాపోటీగా వ్యవహరించారు. కార్యక్రమ వేదిక వద్దకు వచ్చి నేతలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు వారిని పక్కకు తరలించారు. ఈ తీవ్ర ఆందోళనలు.. ఉద్రిక్తతల మధ్యనే అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**అనర్హులకు ఇళ్లు అమ్ముకుంటున్నారు**

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలోనే నిరుపేదల కోసం డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించడం జరిగిందని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ, కాంగ్రెస్ నేతలకు మరియు అనర్హులకు ఇళ్లను కేటాయిస్తోందని మండిపడ్డారు. కౌన్సిలర్లకు అనుకూలంగా ఉన్న వారికి ఇళ్లను అమ్ముకుంటున్నారని, దీనివల్ల నిజమైన అర్హులైన నిరుపేదలకు ఇళ్లు దక్కకుండా పోతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పునరాలోచించి నిజమైన లబ్ధిదారులకే డబుల్ ఇళ్లను కేటాయించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## పారదర్శకంగానే ఎంపిక చేశాం

(మొదటి పేజీ తరువాయి)

జెడ్పి సీఈఓ సుధీర్, మున్సిపల్ కౌన్సిలర్ల సమక్షంలో రాండమైజేషన్ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆయా వార్డు కౌన్సిలర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పారదర్శకంగా డబుల్ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. తాండూరు పట్టణంలో 8,333మంది లబ్దిదారులు డబుల్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోగా.. మొదటి విడతలో 581మంది లబ్దిదారులను ఎంపిక చేసి త్వరలో పట్టాలు అందించడం జరుగుందని వివరించారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, గతంలో కాంగ్రెస్ హయాంలోనే వైఎస్ఆర్ నేతృత్వంలో ఇందిరమ్మ, రాజీవ్‌గృహకల్ప ఇండ్లను నిరుపేదలకు అందించడం జరిగిందని గుర్తు చేశారు. గత పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లను అందించలేక పోయిందని విమర్శించారు. అభివృద్ది విషయంలో పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రేండున్నరేళ్లలో నమ్మి ఓటేసి గెలిపించిన ప్రజల కోసం ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని వివరించారు. అర్హులైన నిరుపేదలకు తప్పకుండా న్యాయం చేస్తామని తెలిపారు. తాండూరులో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, హౌసింగ్ పిడి దశరథ్ సింగ్, మున్సిపల్ కమిషనర్ రాకేష్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఒకే చోట ఒకే ఓటు ఉండాలనే ఉద్దేశ్యం

**షాద్‌నగర్, జూన్ 27, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత పారదర్శకంగా, పటిష్టంగా మార్చేందుకు బోగస్ ఓట్ల నిర్మూలన లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్య క్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డి గూడ గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులుకు ఎమ్మెల్యే ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు.

## జర్నలిస్ట్ శర్మ ఇకలేరు..

**షాద్‌నగర్, జూన్ 27, ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రానికి చెందిన ఈనాడు సీనియర్ పాత్రికేయుడు ప్రభాకర్ శర్మ కన్నుమూశారు. కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయనకు నెల రోజుల క్రితం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స జరిగింది. అనంతరం కోలుకుని స్వగృహమైన బాలానగర్‌కు చేరుకున్నారు. ఇటీవల మళ్లీ అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చేరగా.. చికిత్స పొందుతూ.. శనివారం తుదిశ్వాస విడిచారు.

## తెలంగాణ అమరవీరుల స్థూప ప్రారంభోత్సవం వాయిదా

**షాద్‌నగర్, జూన్ 27, ప్రభాతవార్త :** తెలంగాణ అమరవీరుల స్థూపం ప్రారంభోత్సవాన్ని వాయిదా వేయడం జరిగిందని తెలంగాణ జేఏసీ చైర్మన్ ఎం, జనార్ధన్ కన్వీనర్ బాలరాజ్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ మరియు గోర్ల రాము ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేయడం జరిగింది. ఈనెల 28, 2026 ఆదివారం ప్రారంభోత్సవం జరుగుతుందని గతంలో తెలియజేయడం జరిగింది. కొన్ని అనివార్యకారణాలవల్ల, స్థూపం నిర్మాణము పూర్తికానందువల్ల వాయిదా వేయడం జరిగింది. స్థూపం నిర్మాణం పూర్తి అయిన తర్వాత స్థానిక శాసనసభ్యులు వీర్లపల్లి శంకరన్నతో చర్చించిన తర్వాత ఎప్పుడు ప్రారంభం జరుగుతుందో తేదీని తెలియజేయడం జరుగుతుందని జేఏసీ నాయకులు తెలియజేశారు.

**యువత స్వశక్తిపై ఎదగాలి : షాద్‌నగర్ ఎమ్మెల్యే**

**నందిగామ, జూన్ 27, ప్రభాతవార్త:** ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని కాలం వృధా చేయకుండా నిరుద్యోగ యువత స్వశక్తిపై ఎదిగి ఆర్థిక స్వాలంబన దిశగా పయనించాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. శనివారం నందిగామ అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద ఉన్న మణికంఠ వెజిటేబుల్స్ ప్రోపరేటర్ చందన్ నూతనంగా ప్రారంభించిన వెజిటేబుల్ దుకాణంలో ఎమ్మెల్యే స్వయంగా తాజా ఆకుకూరలు, కూరగాయలు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని, పోషక విలువలతో కూడిన ఆకుకూరలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ ఏం శివశంకర్ గౌడ్, సర్పంచ్ కొమ్ము కృష్ణ, మార్కెట్ డైరెక్టర్ సి నర్సింలు, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కావలి కృష్ణ, అప్పరెడ్డి గూడ ఉప సర్పంచ్ సీతారామ్, ఎర్రగారి రమేష్, ప్రోపరేటర్ విజయ్ ఉన్నారు.

### ల్యాండ్‌పూలింగ్‌ను భూయజమానులు సద్వినియోగం చేసుకోండి

**ఘట్‌కేసర్, జూన్ 27, ప్రభాతవార్త:** ల్యాండ్‌పూలింగ్ ప్రక్రియపై ఆసక్తి ఉన్న భూయాజమానులు, రైతులు తమ సమ్మతిని తహసీల్ కార్యాలయంలో తెలియజేయవచ్చని ఘట్‌కేసర్ తహశీల్దార్ భీమర్తి చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎదులాబాద్, కొర్రెముల, ప్రతాపసింగారం, కాచవానిసింగారం, ముత్వెల్లిగూడలకు చెందిన కొన్ని భూములు ల్యాండ్‌పూలింగ్ ప్రక్రియలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రైతులు, పట్టాదారులు తమ వార్డు కార్యాలయాలు (పాత గ్రామపంచాయతీలు)లలో కూడా వివరాలు నమోదు, అభిప్రాయాల స్వీకరణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతాపసింగారంకు సంబంధించి జూన్ 29వ తేదీన, కాచవానిసింగారంలో జూన్ 30, ముత్వెల్లిగూడలో జూలై 1, కొర్రెములలో జూలై 2, ఎదులాబాద్‌లో జూలై 3వ తేదీలలో వివరాల నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిరోజు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని సంబంధిత రైతులు, భూయాజమానులు ఈఅవకాశాన్ని వినియోగించుకొని నిర్ణీత తేదీలలో తమ ఆమోదాన్ని నమోదు చేసుకోవాలని తహశీల్దార్ చంద్రశేఖర్ సూచించారు.

## నిజాయితీ చాటుకున్న కీసర 108 సిబ్బంది

**ఘట్‌కేసర్, జూన్ 27, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు కీసర 108 సిబ్బంది చికిత్స అందించి వారి బంగారు గొలుసు, నగదును కుటుంబసభ్యులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంకుశాపూర్ సమీపంలోని జాతీయరహదారిపై శనివారం ఉదయం 8 గంటలకు హెచ్‌పిసిఎల్ వద్ద పెట్రోల్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈప్రమాదంలో ఉప్పల్ నుంచి యాదగిరిగుట్టకు బైక్ మీద వెళ్తున్న ఇద్దరు ఐటీ ఉద్యోగులు పురుషోత్తం (30), నవనీత (26)లు గాయపడగా స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న కీసర 108 సిబ్బంది ఈఎంటి చిత్రం రవి, పైలట్ రవితేజలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి తీసుకొని వారికి అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహించి, రక్తస్రావాన్ని అరికట్టి నొప్పి నివారణ చర్యలు తీసుకొని అత్యవసర పరిస్థితులో ఉన్న వారికి మనోధైర్యాన్ని ఇస్తూ నగరంలోని ఆసుపత్రికి తరలించారు. వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించి క్షతగాత్రుల వద్ద లభించిన తులం బంగారపు గొలుసు, రూ.4,300లు నగదు, మొబైల్‌పోన్లు జాగ్రత్తగా భద్రపరిచి వారి కుటుంబసభ్యులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నారు. ఈసందర్భంగా కీసర 108 సిబ్బంది ఈఎంటి చిత్రం రవి, ఫైలట్ రవితేజలను క్షతగాత్రుల కుటుంబసభ్యులు అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు.



బంగారు గొలుసు, నగదు అందజేస్తున్న 108 ఇఎంటి రవి

## హెలెన్‌కెల్లర్ ప్రపంచానికి స్ఫూర్తిదాయకం

**ఘట్‌కేసర్, జూన్ 27, ప్రభాతవార్త:** అంధులకు, బధిరులకు, మూగవారికి వారధిగా, వికలాంగుల ఉద్యమాల సారథిగా హెలెన్‌కెల్లర్ ఎందరికో స్ఫూర్తినిచ్చారని ఎంఎంఎస్ అధ్యక్షురాలు లలిత అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలో శనివారం అమెరికన్ రచయిత్రి–వికలాంగుల హక్కుల కార్యకర్త హెలెన్‌కెల్లర్ జయంతిని నిర్వహించారు.

ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించిన దివ్యాంగులు కేక్ కట్ చేసి అందరూ తినిపించుకున్నారు. హెలెన్‌కెల్లర్ చిన్నతనంలోనే అనారోగ్యం కారణంగా చూపు, వినికిడి, మాట్లాడేశక్తిని కోల్పోయినప్పటికి పట్టుదలతో చదివి ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది వికలాంగులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఈకార్యక్రమంలో ఎన్‌హెచ్‌సి అధ్యక్షులు బి.రవి, కమ్యూనిటీ కోర్డినేటర్ శివశంకర్, సీసీ రజిని, భార్గవి, వసంత, నర్సింహ్మా, అంజనేయులు, దివ్యాంగుల తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీలక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 27, ప్రభాత వార్త:** చౌదరిగూడ ఓయూ కాలనీలో శ్రీలక్ష్మీగణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం కన్నుల పండుగగా జరిగాయి. పోచారం డివిజన్ పరిధిలోని ఓయూ కాలనీ అసోసియేషన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు తిపిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామి కల్యాణోత్సవం వేదపండితులు జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు మాజీ వార్డు సభ్యులు భోజిరెడ్డి, పసులాది నర్సింగ్‌రావు, మాజీ ఎంపీటీసీ బాస్కర్‌రెడ్డి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఓయూ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యుడు వేగానంద్ తదితరులు పాల్గొని స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల మోహన్, కమిటీ కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



చౌదరిగూడ ఓయూ కాలనీలో శ్రీ లక్ష్మీగణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు హాజరైన మాజీ ఎంపీటీసీ సభ్యుడు బాస్కర్‌రెడ్డితో పాటు మాజీ వార్డు సభ్యులు.

# మీ ఓటు.. మీ బాధ్యత!



ఎన్యుమరేషన్ ఫారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ఫారం నింపి బిఎల్వోకు ఇవ్వండి: ఎమ్మెల్యే**

**ఎస్ఐఆర్ కోసం ఎమ్మెల్యే డోర్‌టుడోర్**

**ఓటరు జాబితా సవరణపై ప్రజలకు అవగాహన..**

**కొత్తూర్, జూన్ 27 (ప్రభాత వార్త):** ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేందుకు ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బీఎల్వోలకు అందజేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ఎన్యుమరేషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కొత్తూరు మున్సిపల్ పరిధిలో ఎమ్మెల్యే స్వయంగా ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఎల్వోలు ప్రతి ఇంటికి చేరుకుని ఓటర్లకు ఫారాలు అందజేస్తున్నందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే ఓటరు వివరాలు మ్యాపింగ్ అయిన వారు తమ వివరాలను మరోసారి పరిశీలించి, అవసరమైన చోట సవరణలు చేసి, ఫోటో అతికించి సంతకం చేసి బీఎల్వోలకు అందజేయాలన్నారు. మ్యాపింగ్ కాని ఓటర్లు 2002 ఓటరు జాబితాలో తమ పేరును ధృవీకరించుకుని ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ ఎన్యుమరేషన్ ప్రక్రియలో ప్రజాప్రతినిధులు సైతం భాగస్వాములయ్యేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జే సుదర్శన్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు దేవేందర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ జగన్, జనార్ధన్ చారి, తేజేశ్వర్, నరసింహ గౌడ్, జగన్ గౌడ్, పి రాజు గౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

**..ఏ ఒక్కరి ఓటు కూడ తొలగిపోకుండా చూడాలి**

**..మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి**

**..మూడుచింతలపల్లిలో ఎస్ఐఆర్ సర్వేను పరిశీలించిన వైనం**



మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో ఎస్ఐఆర్ సర్వేను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ జాము రవి, పాల్గొన్న కౌన్సిలర్ నీరజ్‌గౌడ్, తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 27, ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ ప్రక్రియపై అందరు అప్రమత్తంగా ఉండాలని, ఏ ఒక్కరి ఓటు కూడ తొలగిపోకుండా చూడాలని బిఎల్ఓలకు, బిఎల్ఏలకు నిర్వాహకులకు మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి సూచించారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని పోలింగ్ బూత్‌లు 108, 109లలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు సర్వేను (ఎస్ఐఆర్) ప్రక్రియను కౌన్సిలర్ నీరజ్‌గౌడ్‌తో కలిసి చైర్మన్ జాము రవి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ జాము రవి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్నందున ప్రజలు కూడ అప్రమత్తంగా ఉండి ఓటరుగా నమోదు చేసుకోవటానికి, సవరణలు ఉన్నా ఆయా ఫామ్స్‌ను నింపి బిఎల్ఓలకు ఇవ్వాలన్నారు. బిఎల్ఓలు, బిఎల్ఏలు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఓట్లు జాబితాల్లో తొలగిపోకుండ చూడాలన్నారు. ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో కొనసాగేందుకు అవసరమైన చరయలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు కౌన్సిలర్ నీరజ్‌గౌడ్, బిఎల్ఓలు సంధ్య, మంజుల స్థానికులు సదాశివరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

**దేవరయాంజాల్‌లో ఎస్ఐఆర్‌పై ఇంటింటా విస్తృతంగా అవగాహన**

**శామీర్‌పేట, జూన్ 27, ప్రభాతవార్త:** దేవరయాంజాల్‌లోని పలు పోలింగ్ బూత్‌లలో ఎస్ఐఆర్‌పై ఓటర్లకు ఇంటింటా పర్యటించి అవగాహన కల్పించటం జరుగుతుందని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం శామీర్‌పేట డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్ గ్రామంలోని పోలింగ్ బూత్‌లు 154,157లలో ఇంటింటా ఏఈఆర్ఓ పి.మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. బిఎల్ఓలు, బిఎల్ఏలు ఇంటింటా పర్యటించి ఓటరు జాబితాపై అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదు, సవరణల పత్రాలను పంపిణీ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్త పేర్లు నమోదు, ఓటరుల సవరణలు చిరునామాలు, చేర్పులు, మార్పులు ఉంటే సవరించుకోవటానికి ఫామ్స్‌ను అందజేస్తుననట్లు వాటిని నింపి తిరిగి అందజేయాలన్నారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డితో పాటు ఎఈఆర్ఓ పి.మధుసూదన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు రజిత, జానీ, బిఎల్ఓలు ఎం.ఆనంద్, సి.వీరమణి, డి.సరస్వతి, కరిమునిషా, జి.రాధ, బిఎల్ఏలు జి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. బిఎల్ఓలు అందించే ఎన్యుమరేషన్ ఫామ్స్ పూర్తి చేసి సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని వారు సూచించారు.



దేవరయాంజాల్‌లో ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదు,సవరణల పత్రాలను అందజేస్తున్న జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, ఏఈఆర్ఓ మధుసూదన్‌రెడ్డి, తదితరుల దృశ్యం

# తాళం వేసిన ఇంటికి కన్నం

**ఆమనగల్లు, జూన్27, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. పట్టణంలోని శివాలయం కాలనీలో నివాసం ఉంటున్న భూపతి రవి అలియాస్ ప్లంబర్ రవి నివాసంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. రవి కుటుంబసభ్యులు మొహరం పండుగ పురస్కరించుకుని స్వగ్రామం సంకటోనిపల్లికి వెళ్ళారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియన వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న బీరువా తాళాలు ధ్వంసం చేసి దొంగతనానికి పాల్పడ్డారు. పండగ తరువాత శనివారం ఉదయం ఇంటికి వచ్చిన రవి తన గదులకు తాళాలు పగులగొట్టి ఉన్న విషయాన్ని గుర్తించారు. దీంతో దొంగతనం జరిగిందని నిర్ధారణకు వచ్చిన ఆయన వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు ఘటన స్థలాన్ని చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బాధితున్ని పలు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే షాద్‌నగర్ నుండి ప్రత్యేక క్లూస్ టీం వచ్చి దొంగతనం వద్ద దర్యాప్తును ప్రారంభించింది. పట్టణంలో దొంగతనం జరిగిన విషయం తెలిసిన వెంటనే ప్రజలు ఆంధోళన వ్యక్తం చేశారు.



కరీంగూడలో మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సూపరిండెంట్ ఫయాజుద్దీన్

## భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి

**కీసర, జూన్27, ప్రభాతవార్త:** భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలని ఎక్సైజ్ సూపరిడెంట్ ఫయాజుద్దీన్ అన్నారు. శనివారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని కరీంగూడలో గ్రామంలో 250 బీహర్ తాటి చెట్లను నాటారు. ఈ కార్య క్రమంలో ఎక్సైజ్ సిఐ జూపల్లి రవి, ఎస్ఐ సంగతారెడ్డి, టిటిసిఎస్ అధ్యక్షులు దేశం రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు దేశం అంజయ్యగౌడ్, కార్యదర్శి దేశం వెంకటేష్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు దేశం ఉమా మహేశ్వర్‌గౌడ్, దేశం శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**పూడూరు, జూన్ 27, ప్రభాతవార్త :** ఓవ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం రాకంచెర్ల గ్రామంలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం పరిగి మండలం కాడ్లాపూర్ తాండకు చెందిన విస్నావత్ వెంకట్‌రామ్ (35) అనేవ్యక్తి తన బావమర్ది వివాహం నిమిత్తం ఈనెల 24వతేదీన పందిరి వేసేందుకు తన భార్య పుటినింటి గ్రామం రాకంచెర్లకు వచ్చాడు. శనివారం ఉదయం 9.30గంటల ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని మృతిచెంది ఉన్నాడు. ఈ విషయం మృతుడి మరుదలు సుశీల మృతుడి తండ్రి విస్నావత్ శంకర్‌కు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చింది. దీంతో మృతుడి తండ్రి శంకర్, గ్రామస్తులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం తన కుమారుడు వెంకట్‌రామ్ ఆత్మహత్యపై అనుమానం వ్యక్తచేస్తూ చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. నెల24వతేదీన తనభార్య దేవమ్మ తనతో విడాకులు కావాలని బెదిరించినట్లు తన చిన్నకుమారుడు శ్రీనుకు మృతుడు వెంకట్‌రామ్ ఫోన్‌చేసి చెప్పినట్లు ఆరోపిస్తూ, మృతుడి భార్య దేవమ్మ, మామ లోక్యానాయక్, అత్త కమ్లీబాయ్, బామ్మర్ది, సివునాయక్‌లపై అనుమానం వ్యక్తంచేస్తూ మృతుడి తండ్రి శంకర్ పిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్, జూన్ 27, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు, 18వ వార్డుల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏలు)తో మాట్లాడి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## శిలాఫలకంపై సరైన స్థానంలో పేరు లేదు



**కోట్‌పల్లి, జూన్ 27, ప్రభాతవార్త;** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలంలో సర్వశిక్షా అభియాన్ పథకం ద్వారా రూ.4.15 కోట్లు నిర్మించిన నూతన కేజీబీవీ భవనాన్ని ప్రారంభోత్సవానికి ప్రోటోకాల్ ప్రకారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరును శిలాఫలకంపై సరైన స్థానంలో పొందుపరచలేదని బీజెపి వికారాబాద్ నియోజక వర్గ ఇంచార్జీ వడ్ల నందు పార్టీ నాయకులు తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ పై ఆరోపించారు. దింతో కార్యక్రమంలో స్వల్ప ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వడ్ల నందు మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధుల హోదాలకు తగిన గౌరవం ఇవ్వడం అధికారుల బాధ్యత అన్నారు. అలాగే ప్రజల ఆశయాలకు అనుగుణంగా అధికారులు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు శివకుమార్, లింగంపల్లి సర్పంచ్ మహేందర్ దేశ్‌ముఖ్, యువ మోర్చా అధ్యక్షులు అభిలాష్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, నర్సాపురం రమేష్, బాలరాజ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు